దివ్యాంగులపై సర్కారు కాఠిన్యం

ఊరి పేరు మార్చారు



● ఈమె పేరు గడ్డం గౌసియా బీ, భర్త పాలిస్ బండల కటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పాణ్యంలోని గడ్డంపేటలో నివాసముంటున్నారు. ఈమెకు మూగ, చెవుడు ఉంది. 2008 నుంచి ఈమె దివ్యాంగ పింఛన్ తీసుకుంటోంది. ఈ నెల కూడా రూ.6 వేల పింఛన్ అందింది. అయితే రీ వెరిఫికేషన్‌లో భాగంగా డాక్టర్లు కేవలం 40 శాతం వైకల్యం ఉందని, అది కూడా తాత్కాలికమైనదేనని నిర్ధారించారు. డాక్టర్లు నిర్ధారించిన అనంతరం పాణ్యం గడ్డంపేటకు చెందిన ఈమెను సుగాలిమెట్ట వాసిగా నమోదు చేశారు.

వైకల్య శాతం తగ్గించారు



● ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి కొలురు గ్రామానికి చెందిన దుదేకుల పెద్ద ఉసేని, వయస్సు 58 సంవత్సరాలు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం ఉన్నారు. 2022 నవంబర్‌లో ఈయన పక్షవాతానికి గురయ్యారు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుత సంవత్సరంలోనే సదరంకు దరఖాస్తు చేసుకోగా నంద్యాల జీజీహెచ్‌లో పరీక్షించిన వైద్యులు 90 శాతం పర్మినెంట్ వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించారు. ఈ సర్టిఫికెట్లతో పింఛన్‌కు దరఖాస్తు చేసుకొని ప్రతి నెలా పింఛన్ తీసుకుంటున్నారు. ఇద్దరు సహాయం చేస్తే గానీ నిల్చోలేరు. ఎడమ చెయ్యి పూర్తిగా పనిచేయదు. కాలు అదవగా మారింది. అత్యంత కష్టంమీద స్టిక్ సాయంతో నిలబడతారు. డాక్టర్ల సూచనల మేరకు ప్రతి నెలా రూ.3 వేల విలువైన మందులు వాడాల్సి ఉంటుంది. ఈ నెల రూ.6 వేలు పింఛన్ తీసుకున్న తర్వాత ప్రభుత్వం నుంచి నోటీసులు అందడంతో డోన్‌లోని సదరం క్యాంపునకు వెళ్లగా 80 శాతం టెంపరరీ వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ జారీ చేశారు. దీంతో పింఛన్ రద్దవుతుందేమోనని తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

రూ.9 వేలు కోత



● ఈయన పేరు ఎస్.శ్రీనివాసులు పాణ్యంలోని అయ్యపురెడ్డి కాలనీలో నివాసముంటున్నారు. కాళ్లు పనిచేయక మంచానికే పరిమితం అయ్యారు. కాలకృత్యాలకు కూడా ఇతరుల సహాయం ఉండాలి. 2011కు ముందు ట్రాక్టర్ పనికి వెళ్లి మట్టి పెల్లలు వెన్నుముక మీద పడడంతో అప్పటి నుంచి వెన్నుముక, కాళ్లు పని చేయడం లేదు. 2011లో కర్నూలులోని సదరం క్యాంపునకు వెళ్లగా డాక్టర్లు 90 శాతం వైకల్యం ఉన్నట్లు నమోదు చేసి సర్టిఫికెట్ మంజూరు చేశారు. అప్పటి నుంచి దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్నారు. ప్రస్తుత నెల రూ.15వేల పింఛన్ తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి నోటీసులు అందడంతో సదరం శిబిరానికి వెళ్లగా కేవలం 65 శాతం వైకల్యం ఉన్నట్లు నమోదు చేసి రూ.6 వేల పింఛన్‌కు పరిమితం చేశారు. ఈయనకు ఒక కుమారుడు సంతానం. భార్య సంపాదనతోనే కుటుంబం వెల్లదీస్తున్నారు. డాక్టర్లు ఇచ్చిన రీ వెరిఫికేషన్‌లో పాణ్యం గాకుండా సుగాలిమెట్ట అని ప్రచురించారు. దీనిపై బాధితుడు కుటుంబంతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

● ఇష్టానుసారంగా పింఛన్ల తొలగింపు
● తప్పుల తడకగా నోటీసులు

పాణ్యం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లలో కోత పెట్టింది. గత ప్రభుత్వంలో సదరం ద్వారా పొందిన పింఛన్లపై మరో మారు సదరం క్యాంప్‌లు ఏర్పాటు చేసి చాలా మందిని తొలగించడమే గాక, ఎంతో మందికి వైకల్య శాతం తగ్గించారు. దీంతో దివ్యాంగులు మండిపడుతున్నారు. పాణ్యం మండలంలో 492 మంది సదరం క్యాంప్‌లకు వెళ్లగా 337 మందిని అర్హులుగా తేల్చారు. వీరిలో చాలా మందికి వైకల్య శాతం తగ్గించారు. 161 మందిని అనర్హులుగా నిర్ధారించారు. కొన్నేళ్లుగా పింఛన్ తీసుకుంటున్న తమను కూటమి ప్రభుత్వం అనర్హులుగా తేల్చడంతో వారంతా మండిపడుతున్నారు. దుర్మార్గంగా పింఛన్లు తీసేస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు.



● ఇక్కడ కనిపిస్తున్న సి.బెళగల్‌కు చెందిన మరగుజ్జు దివ్యాంగురాలి పేరు షేకున్. వయసు 28 సంవత్సరాలు. గతంలో 70 శాతం వికలత్వం ఉందని డాక్టర్లు ధ్రువీకరించి సర్టిఫికెట్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ తనిఖీలో 38 శాతం మాత్రమే వికలత్వం ఉందంటూ పింఛన్ తొలగించేందుకు సచివాలయ ఉద్యోగులు నోటీస్ జారీ చేశారు.



● ఈమె పేరు కురువ జయమ్మ. సి.బెళగల్ బీసీ కాలనీలో నివాసము ఉంటోంది. పుట్టుకతో మూగ, చెవిటి. గతంలో సదరం క్యాంప్‌లో డాక్టర్లు పరీక్షించి 100 శాతం వికలత్వం ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రీవెరిఫికేషన్‌లో 38 శాతం మాత్రమే వికలత్వం ఉన్నట్లు నోటీస్ జారీ చేసింది.

సి.బెళగల్: రీవెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం పింఛన్లకు కోత వేసేందుకు సిద్ధమైంది. దాదాపు 25 ఏళ్ల నుంచి పింఛన్ పొందుతున్న వారిని కూడా వికలత్వం శాతం తక్కువగా ఉందంటూ నోటీసులు జారీ చేస్తోంది. ఇప్పటికే మండలంలో 150 మందికి పైగా నోటీసులు అందజేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. వీరికి వచ్చే నెల నుంచి పింఛన్ నిలిపివేయనున్నట్లు సమాచారం. అయితే అర్హులెవరైనా ఉంటే ఆధారాలతో మరోసారి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పింఛన్ పునరుద్ధరిస్తామంటూ అధికారులు చెబుతుండటం గమనార్హం.

దివ్యాంగుల కన్నీళ్లు ప్రభుత్వానికి పట్టవా?

● సుపరిపాలన అంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు
● వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి

కర్నూలు (టౌన్): దివ్యాంగులకు ఉన్న ఏకైక జీవనాధారం పింఛన్‌ను కూటమి సర్కార్ నిర్దాక్షిణ్యంగా తొలగించడం దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి వాపోయారు. వారి కన్నీళ్లు ప్రభుత్వానికి కనిపించవా? అని ప్రశ్నించారు. బుధవారం స్థానిక సీతారామనగర్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం పూర్తి అర్హత కలిగిన వారికి సైతం పింఛన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. జీవనాధారమైన పింఛన్ తొలగించడంతో దివ్యాంగులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు దాపురించాయని మండిపడ్డారు. ప్రభుత్వానికి ఆర్థిక భారంగా భావించి ఏదో ఒక సాకులతో పింఛన్లను తొలగిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్లు కోల్పోయిన దివ్యాంగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు ఉన్నాయని, ప్రభుత్వం వారి ఆగ్రహానికి గురికాక తప్పవద్దన్నారు. కాళ్లు లేవు, కళ్లు లేవు, చేతులూ పనిచేయని వారి పింఛన్లను కూడా తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఇన్ని కుట్రలు చేస్తూ సుపరిపాలన అంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తొలగించిన పింఛన్లను తిరిగి పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేదల భూముల్లో అక్రమ వెంచర్లు



మాట్లాడుతున్న రామకృష్ణ

ఓర్వకల్లు: పేదలకు అసైన్డు చేసిన ప్రభుత్వ భూముల్లో వెంచర్లు వేయడం చట్టరీత్యా నేరమని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని నన్నూరుకు చెందిన దళితుల భూములను వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్నతో కలిసి రామకృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. దాదాపు 70 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దళిత రైతుల భూములను సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సర్వే నంబర్ 1292లో భూములను 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు కేటాయించి పట్టా, పాసుపుస్తకాలు మంజూరు చేశారన్నారు. ఆ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయడమే గాక, అందులో సాగు చేసిన కంది పంటను ట్రాక్టర్లు, జేసీబీలతో నాశనం చేయడం దుర్మార్గం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు స్పందించి తక్షణమే దళితుల భూముల్లో పంటలను నాశనం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ భూములను సర్వే చేసి రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. లేనిపక్షంలో బాధిత రైతులతో కలిసి ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు కృష్ణ, మండల కార్యదర్శి మధుసూదన్, బషీర్, లింగేశ్వరుడు, సంజీవుడు, శివకుమార్, రామచంద్రుడు, వంశీ, గిరిబాబు, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

పాణ్యం: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. బుధవారం పాణ్యం డిగ్రీ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాణ్యం డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలన్నారు. అసౌకర్యాల మధ్య విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కళాశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, ల్యాబ్ సౌకర్యాలు లేవన్నారు. విద్యార్థులకు ఎస్ఎంహెచ్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.3 వేలు మెస్ బిల్లులు ఇవ్వాలని, ఫీజు బకాయిలను చెల్లించాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రజా సంఘాల ప్రవేశంపై నిషేధం విధిస్తూ ఇచ్చిన జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ జీఓతో విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. మండల నాయకులు రాజు, శ్రీరామ్, విగ్నేష్, లక్ష్మీ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

కల్లూరు: గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాల వల్ల పాణ్యం నియోజకవర్గంలోని 16 వార్డుల్లో తలెత్తిన సమస్యలపై ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మున్సిపల్ కమిషన్ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులతో బుధవారం మాధవి నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల సమస్యలపై చర్చించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా కాలనీలో సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, నాయకులు ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం!



కర్నూలు మండల పరిధిలోని ఉల్చాల గ్రామం ప్రధాన కూడలిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీతో పాటు ఇదే దారిలో రేమట మీదుగా నాగలాపురం, తులాశపురం మీదుగా జి.సింగవరం గ్రామాలకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికే ఎన్నో సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదనో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తక్కువ ఎత్తులో.. అది కూడా ఎలాంటి రక్షణ గోడ లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

– కర్నూలు(రూరల్)

మౌలిక వసతులు కల్పించాలి



కాలనీలో బురదమయమైన రోడ్డును చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ పందిపాడు ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ కాలనీలో సీపీఎం ప్రతినిధులు రాముడు, నాగేష్, సుధాకరప్ప, భాస్కర్, రామకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పర్యటించారు. వారు మాట్లాడుతూ.. 2009లో కాలనీలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. ఇప్పటివరకు వసతులు కల్పించలేదని వాపోయారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మట్టి రోడ్లు బురదమయంగా మారయన్నారు. డ్రైనేజీ కాలువలు లేక వర్షం వచ్చిన ప్రతిసారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి సమయంలో కాలనీ వాసులు బయట తిరగడానికి భయపడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కాలనీ వాసులు అయ్యన్న, మల్లేశ్వరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా



తమ్మరాజుపల్లి సమీపంలో బోల్తాపడిన కారు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలో ఎస్ టర్నింగ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల నుంచి కర్నూలుకు వెళ్తున్న కారు టైర్ అకస్మాత్తుగా పగలడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ఉన్న ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

ఓర్వకల్లు: ఈ నెల 20వ తేదీ నుంచి ఒంగోలులో నిర్వహిస్తున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బుగ్గరామేశ్వర డిగ్రీ కళాశాలలో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి లెనిన్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర మహాసభలను ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓర్వకల్లు మండలంలో అనేక పరిశ్రమలు వచ్చినప్పటికీ స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 23న వేలాది మందితో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆటో యూనియన్ మండల నాయకులు సంజీవరాజు, రమేష్, ఏఐవైఎఫ్ బాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మికంగా చనిపోతున్న గేదెలు

● రెండు రోజుల్లోనే 20 పశువుల మృతి
● పశు వైద్యులు పట్టించుకోవడం లేదంటున్న పాడి రైతులు



గడివేములలో గేదె కళేబరాన్ని పడేసేందుకు తీసుకెళ్తున్న రైతులు

గడివేముల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పాడి గేదెలు ఆకస్మికంగా మృత్యువాత పడుతున్నాయి. రెండు రోజుల్లోనే దాదాపు 20 దాకా గేదెలు మృతి చెందినట్లు పాడి రైతులు ఆరోపిస్తున్నారు. పశువులకు సకాలంలో మెదడు వాపు వ్యాధి టీకాలు వేయకపోవడంతో ఇలా చనిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం టీకాలు వేసివుంటే ఈ పరిస్థితి ఉండేది కాదని రైతులు చెబుతున్నారు. రూ.లక్షలు విలువైన పాడి పశువులు చనిపోవడంతో నష్టం వాటిల్లుతోందని, కొన్ని పశువులకు బీమా ఉన్నప్పటికీ పరిహారం రాదని పశు వైద్యులు తెగేసి చెబుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. కనీసం చనిపోయిన పశువుల వద్దకు పశు వైద్య సిబ్బంది వచ్చి చూడటం లేదని ఆరోపిస్తున్నారు. గడివేముల గ్రామానికి చెందిన భార్గవ్‌రావు, తలారి పెద్దమాచేర్లు, మానికింది మాచేర్లు, కురువ పెద్దన్న, సన్నక్క, కుమ్మరి పెద్దన్నతో పాటు పలువురు రైతులకు చెందిన రూ.లక్షల విలువైన పశువులు మృతి చెందడంతో తీసుకెళ్లి ఊరి బయట పడేశారు. ఇప్పటికైనా పశువైద్య అధికారులు స్పందించి పాడి పశువులు మృత్యువాత పడకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పశువులు చనిపోవడంతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



గడివేములలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ రంజిత కుమారి సూచించారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఫ్రైడే – డ్రైడే పాటించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ఆనందరావు అన్నారు. బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాలలో.. దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. రాత్రివేళ దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. డ్రైనేజీలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని నిర్మూలించాలన్నారు. అలాగే కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మోతీలాన్ నాయక్, డాక్టర్ శైలేష్‌కుమార్ కాలనీలో పర్యటించి ప్రజలకు దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించారు. ఉపాధ్యాయులు, ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు మద్దమ్మ, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి



పత్తి రైతులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: పత్తి పంటలను సాగు చేస్తున్న రైతులు పంటల సంరక్షణలో యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని ఏఓ మల్లేష్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన గుండ్రేవుల, సంగాల గ్రామాల పరిధిలోని పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. పంటలో అధిక వర్షపు నీటి నుంచి పంట సంరక్షణకు ఒక లీటరు నీటిలో 13.0.45ను రెండు గ్రాముల చొప్పున, లీటరు నీటికి ఐదు గ్రాముల యూరియాను కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు, రసంపీల్చే పురుగు, పేనుబంక, తేనే బంక తెగుళ్ల నివారణకు ఎకరాకు 10 చొప్పున లింగాకర్షక బుట్టలు, పసుపు, తెలుపు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సామూహికంగా పురుగులను ఆకట్టుకునేందుకు ఎకరాకు 20 లింగాకర్షక బుట్టలు పత్తి పొలంలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, వీఏఏ సునీత, ఎంపీఈఓలు వెంకటేష్, సోమేశ్వరి, రైతులు సయ్యద్‌బాబు, రాముడు పాల్గొన్నారు.

లద్దగిరి గ్రామంలో ..

వర్షాలు కురుస్తున్న వేళ పత్తి పంటకు తెగుళ్లు, పురుగులు సోకకుండా రైతులంతా ముందస్తు మందులను పిచికారీ చేసి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. బుధవారం ఆయన లద్దగిరి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొలాల్లో నిలిచిన వర్షపునీరు కాలువల ద్వారా బయటకు వెళ్లేందుకు కాలువలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

యూరియా పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు, ఏఓ రూఫస్‌రోనాల్డ్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని నిడ్జూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు, ఏఓ రూఫస్ రోనాల్డ్ రైతులనుద్దేశించి మాట్లాడారు. అవసరమైన మేరకే పంటలకు యూరియా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(రూరల్): మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని ఏడీఏ సాలురెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని నిడ్జూరు గ్రామ పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. అధికంగా ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. పైర్లు బలహీనమై, పూత పెట్టడం ఆలస్యమవుతుందని, గింజ నాణ్యత తగ్గిపోవడంతోపాటు దిగుబడులపై ప్రభావం చూపుతుందని వివరించారు. యూరియా కొరత నేపథ్యంలో నానో యూరియా ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కర్నూలు మండల వ్యవసాయ అధికారి రూఫస్ రోనాల్డ్ పాల్గొన్నారు.

ఉల్లి పంట పరిశీలన



ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి మదన్‌మోహన్

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్, ముడుమాల, కొత్తకోట గ్రామాల పరిధిలో అధిక వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి పంటలను కోడుమూరు ఉద్యాన అధికారి మదన్‌మోహన్ బుధవారం పరిశీలించారు. వర్షపు నీరు నిల్వలేకుండా బయటుకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఆయన వెంట వీఏఏ ప్రవీణ్ ఉన్నారు.

క్లుప్తంగా

వెండి పడిగె వితరణ



వెండి పడిగెను అందజేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామికి భక్తులు వెండి పడిగెను బహూకరించినట్లు ఈఓ రామక్రిష్ణ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బనగానపల్లె మండలం నందవరం గ్రామానికి చెందిన శ్రీమతి కంపమల్ల వెంకటలక్ష్మమ్మ, వెంకటసుబ్బారెడ్డిల కుమారుడు హరిప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి 1010 గ్రాముల వెండి పడిగెను అందించారు. దాతలకు అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

'సోలార్' భూముల పరిశీలన



గనిలో సోలార్‌కు కేటాయించిన భూములను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామంలో గతంలో సర్వే నంబర్ 748లో 599.60 ఎకరాల భూమిని ఏపీఎస్పీసీఎల్ సోలార్ వారికి కేటాయించడం జరిగిందని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తెలిపారు. బుధవారం క్షేత్రస్థాయిలో భూముల సరిహద్దులను, మ్యాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా సోలార్‌కు కేటాయించిన భూముల వివరాలను తహసీల్దార్ వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు సమర్పించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, సోలార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం



ప్రధానోపాధ్యాయురాలికి నగదును అందిస్తున్న మామిళ్లపల్లి శ్యామ్ సుందర్ శర్మ

గడివేముల: మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10 వేల విలువగల గుర్తింపు కార్డులను శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి శ్యామ్ సుందర్ శర్మ అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు చంద్రావతి మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బీ.ఎస్.రామ్మోహన్ రెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు నగిరి శ్రీనివాసులు నగదు బహుమతులు ఇవ్వడం సంతోషమన్నారు. వచ్చే విద్యా సంవత్సరం పదో తరగతిలో ప్రతిభ కనబరిచే వారికి శ్యాంసుందర్ శర్మ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గోగుల నాగేశ్వరావు నగదు బహుమతులు ప్రకటించడం అభినందనీయమన్నారు. ఎంపీటీసీ జక్కుల సావిత్రి, ఉపసర్పంచ్ గోదా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

23 వరకు ఆధార్ కేంద్రాలు

పాణ్యం: ఈ నెల 23వ తేదీ వరకు ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆలమూరు, గోనవరం, కొణిదేడు, గోరుకల్లు కొండజుటూరు, మద్దూరు, భూపనపాడు, నెరవాడ, బలపనూరు, గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, ఇతర సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుధాకర్

కల్లూరు: మండల పరిధిలోని నెరవాడ ఎంపీపీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధి వల్ల కలిగే సమస్యలపై అధికారులు అవగాహన కల్పించి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. తాగడానికి, వంటలు వండడానికి నీరు ముఖ్యమన్నారు. నీటిలో మంచి సూక్ష్మ పోషకాలు ఉంటాయని, అవి తగిన మోతాదులో ఉంటే సమస్యలు రావని, తగినంత లేకుంటే ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల దంతాలు పసుపు, గోధుమ రంగులోకి మారడం, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎముకలు గుండ్రంగా వంగిపోయి కీళ్ల నొప్పి, కండరాల బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఉపాధ్యాయులు శర్మ, ఆరోగ్య కార్యకర్త సరళ, మహేశ్వరి, ఆశా కార్యకర్త మెహరున్నిసా తదితరులు పాల్గొన్నారు.